కొంచెంసేపు 'డబ్బుస్కు డబ్బుస్కు' డ్యాన్సులేసినారు.

పోతూపోతూ.. ''లొ.. లొల్లల్లో..'' అని కిల్లరించి నారు. సిద్దులయ్య కుడి చేత్తో పైగుడ్డ విసురుతూ..

''పదండి.. పదండి'' అంటూ జనాన్ని తరిమి, ఎడమ చేత్తో మేక తాడును లాగినాడు.

మేక కొంచెం కూడా కదలలేదు. గట్టిగా కాలి గిట్టలతో నేలని బలంగా అదిమి పెట్టుకుని ఉంది. అది ప్రాణ భయంతో గట్టిగా గాలి పీల్చి వదులుతున్నది.

తాడును చేత్తో రెండో మడత వేసి లాగినాడు. మరింత బిగుసుకుంది మేక.

పళ్లను కింది పెదవితో అదిమి పట్టి మరింత గట్టిగా లాగినాడు. రెండు అడుగులు దాన్ని బరబరా ఈడ్చి నాడు. దాని మోకాళ్లు నేలకి రాసుకుని దుమ్ము లేస్తు న్నాది. అది తన శక్తినంతా కూడగట్టుకుని మొండికేసి మెడను గట్టిగా విదిలించింది.

అంతే.. పుటుక్కున తెగింది తాడు. డబుక్కున ఎగిరి నిలబడింది మేక. క్షణం కూడా అక్కడ నిలవలేదు. పరిగె త్తడం ప్రారంభించింది. దాని వెనక సిద్దులయ్య, బడి పిల్లోళ్లు, పలకలు కొట్టేవాళ్లు పరుగో పరుగు..

చింతల చేను వరకు అందరూ పరుగులు తీసినారు. ఆ పైన ఉండేది అంతా మిట్ట ప్రాంతమే! పలకలు కొట్టే వాళ్లు గెస పోసుకుంటూ గెనుము మీద కూర్చునేసినారు.

'మేకపోతు ఎక్కడికి పోతుందిలే.. మన సిద్దులయ్య ఎట్లనో ఒకట్ల పట్టకచ్చేస్తాడు!' అనుకుంటూ.. అమాటా ఈమాటా చెప్పుకొంటున్నారు. సందిట్లో సడేమియాగా బడి పిల్లోళ్లు పిల్లకాలువలో చేపలు పట్టే పని ప్రారంభించినారు.

ముందు మేక.. దాని వెనుక సిద్దులయ్య!

మూడు మూరల దూరంలో తక్కోళం మామ.

మేక పరిగెత్తి పరిగెత్తి తాటికాయల గుంత కాడికి పోయి నిలబడింది.

'అబ్బ! దొరికిందిలే..' అనుకున్నాడు సిద్దులయ్య.

అట్లా ఇట్లా చూసిన మేక, మెరుపు మాదిరి టక్కుమని ఎగిరి పాత గుట్ట మీదికి ఎక్కి నిలబడింది.

గెస పోసుకుంటున్నాడు సిద్దులయ్య. ఒళ్లంతా చెమ టలు కారుతున్నాయి. వెనకనే వచ్చిన వాళ్లలో తక్కోళం మామ మాత్రమే మిగిలినాడు. ఎడమకాలి మోకాలు నొప్పి పుట్టడంతో గుట్ట ఎక్కలేక నిలబడినాడు. మేక సర్రుసర్రున పాత గుట్ట దాటి పొట్టి గుట్టలు ఎక్కింది.

''దీనెమ్మ .. నాయాల్ది! ఉపద్రవం చేస్తా ఉందే..'' అంటూ, ఒక కాశి రాయి తీసి దానిపైకి విసిరినాడు.

అది చటుక్కున పెద్ద బండ వెనక్కి వెళ్లింది.

విసిరిన రాయి నేరుగా వెళ్లి బండకి తగిలి పది ముక్కలై చెల్లా చెదురుగా పడింది.

**'ఇక్కడినుంచి వెళ్లిపో! మా వాళ్లు నిన్ను చంపేస్తారు' అంటూ దానికి సైగ చేసినాడు. అది కదలలేదు, మెదలలేదు. ''అరె.. ఛత్'' అని గదిమినాడు. అది బాధగా చూస్తూ నాలుగు అడుగులు వేసింది. 'ఘల్ ఘల్' శబ్దాలు వినిపించాయి.**

సిద్దులయ్య ఆవేశం కట్టలు తెంచుకుంది.

పంచ ఎగ గట్టి గబగబా పొట్టి గుట్టలు ఎక్కి నిలబడి నాడు. దూరంగా వెదురు చెట్టు పొదల ముందు నిలబడి ఉంది మేక.

'ఈసారి వదిలేది లేదు' అనుకుంటూ.. ఒక రెండు అడుగుల రాయి మీద కాలు పెట్టినాడు. దాని కింద ఇసుక ఉండటంతో సర్రున జారింది. పట్టు తప్పినామని తెలుసుకుని, పక్కనే ఉన్న మామిడి కొమ్మ పట్టుకు న్నాడు. బరువు భరించలేని కొమ్మ విరిగిపోయింది. దొర్లుకుంటూ రెండు పొడుగాటి తాటిచెట్లంత లోతు లోయలో పడినాడు.

వెనకనుంచి చూసిన తక్కోళం మామ వెంటనే వెనక్కి తిరిగి పరుగులు తీసి ఊర్లో వాళ్లకి విషయం చెప్పినాడు. ఊర్లో వాళ్లు వెదురు కర్రలు, చేంతాళ్లు, టార్చిలైట్లు, నీళ్ల బిందెలు ఎత్తుకుని పొట్టి గుట్టలకాడికి పరుగులు తీసి నారు. మేక తప్పించుకుందని, నాన్న లోయలో పడినా డని గోవిందుడికి విషయం తెలిసింది. రేసుగుర్రం లెక్కన అడ్డదారిలో ఒంటిగా పరుగులు తీసినాడు.

నేరుగా వెళ్లి లోయ ముందర నిలబడినాడు.

అక్కడే ఉన్న తక్కోళం మామ..

''గోవిందా.. చెడ్డ కాలంలో మంచి కాలం. మీ నాయనకు ఏమీ కాలేదు'' అని ధైర్యం చెప్పినాడు.

ఇంతలో పలకలు కొట్టేవాళ్లు, బడి పిల్లోళ్లు, ఊర్లో వాళ్లు వచ్చి చేరినారు. పైనుంచే సిద్దులయ్యకు ధైర్యం చెప్పినారు.

''భయపడొద్దు. ఏమీ కాదు. మేమున్నాం!'' అని ఒకటికి రెండుసార్లు చెప్పినారు.

సిద్దులయ్య గుండె డబుక్కు డబుక్కుమని కొట్టుకుం టున్నాది. మొదటిగా టార్చిలైటును చిన్నతాడుకు కట్టి వదిలినారు. తన చుట్టూ పాము లాంటిదేమైనా ఉంటుం దేమోనని టార్చిలైటు వేసి చూసినాడు. చిన్నచిన్న పురు గులు తప్పితే ఇంకేమీ కనిపించకపోయేసరికి సిద్దు లయ్యకు ధైర్యం వచ్చింది. చిన్నతాడుకు నీళ్ల బిందె కట్టి లోపలి దింపినారు. నీళ్లను చూసిన సిద్దులయ్యకు ప్రాణం లేచి వచ్చింది. కొన్ని నీళ్లను ముఖం పైన చల్లుకు న్నాడు. పైగుడ్డతో ముఖం తుడుచుకున్నాడు. బిందెను పైకి ఎత్తి నీళ్లన్నీ గుటగుటా తాగి బిందెను పైకి పంపించేసి నాడు. పైన ఉన్నవాళ్లు తాళ్లను ఒకదానికొకటి బలంగా పెనవేసి కట్టినారు. తెగుతుందేమోనని బలంగా లాగి చూసినారు. ఏమీ కాదని ధైర్యం తెచ్చుకుని చిన్నగా తాడును లోయలోకి వదిలినారు.

తాడును చూసిన సిద్దులయ్య.. 'హమ్మయ్య' అనుకు న్నాడు. తాడుని గట్టిగా పట్టుకుని చిన్నచిన్నగా పైకి వస్తు న్నాడు సిద్దులయ్య.

'నాన్న క్షేమంగా ఉన్నాడు. భయం లేదు. ఎలాగోలా ఊర్లో వాళ్లు బయటికి తీస్తారు. మరి మేక ఏమ య్యింది?' అనుకుని, నిక్కినిక్కి తల ఎత్తి చూసినాడు గోవిందుడు.

దూరంగా పొట్టి గుట్టల మధ్యలో పెద్ద బండరాయి వెనుక దాక్కొని ఉంది. మేక పూర్తిగా కానరాలేదు కానీ, దాని బెత్తెడు తోక మాత్రం కనిపించింది.

దాన్ని ఎలాగైనా కాపాడాలనుకున్నాడు.

ఎవ్వరూ చూడకుండా చెట్ల మధ్యన కొంచెంసేపు చిన్నగా నడిచి ఫర్లాంగు దూరం పోయినాక పరుగు అందుకున్నాడు. దారిలోని తుమ్మ చెట్టు చొక్కాయికి తగులుకుని చొక్కాయి చినిగిపోయింది. పట్టించుకోలేదు.

ఇసుక కాలువ అడ్డం వచ్చింది. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టమయ్యింది. పక్కనున్న చెట్లను లాగి పట్టుకుంటూ నడిచినాడు.

చూసుకోకుండా బ్రహ్మజెముడు ముళ్లు తొక్కినాడు. రక్తం వచ్చింది. గబుక్కున ఇసుకని గుప్పిట్లోకి తీసుకుని దాని పైన పోసినాడు. కుంటుకుంటూ కొంచెం ఎత్తు ఎక్కి దిగేసరికి మేక ఉన్న బండ వచ్చింది.

గోవిందుడిని అది భయభయంగా చూసింది. అక్కడి నుంచి తప్పించుకెళ్లాలని కొంచెం కదిలింది.

ఎప్పుడూ తను అభిమానంగా పిలిచేలా.. 'యా.. యా..' అంటూ పిలిచినాడు.

తల తిప్పి గోవిందుడి కళ్లనే చూసింది. ఏమీ చేయడని ధైర్యం వచ్చిందేమో.. అక్కడే కదలకుండా నిలుచుంది.

దగ్గరికి వెళ్లాడు. దాని తడి కళ్లను చూసి గట్టిగా దాని మెడను వాటేసుకున్నాడు.

'ఇక్కడినుంచి వెళ్లిపో! మా వాళ్లు నిన్ను చంపేస్తారు' అంటూ దానికి సైగ చేసినాడు.

అది కదలలేదు, మెదలలేదు.

''అరె.. ఛత్'' అని గదిమినాడు.

అది బాధగా చూస్తూ నాలుగు అడుగులు వేసింది.

'ఘల్ ఘల్' శబ్దాలు వినిపించాయి.

'వాటిని తీసేయాలి. లేకుంటే దాని జాడ తెలిసిపో తుంది ఊళ్లో వాళ్లకి..' అనుకుంటూ, దాని దగ్గరికి పరిగెత్తినాడు. దాని కాళ్లకున్న గజ్జెలు తెంపినాడు. వాటిని దూరంగా నీటి కుంటలోకి విసిరినాడు.

''పో.. పో..'' అని అరుస్తూ దాన్ని తరిమినాడు.

అది తడి కళ్లతో.. ఒకటికి రెండుసార్లు దీనంగా గోవిం దుడి వైపు చూసింది.

''నీకే కదా.. చెప్పేది!'' అని ముల్లుకర్ర చూపినాడు.

అంతే.. అది జింక లెక్కన ఎగురుకుంటూ అడవిలోకి పరుగులు తీసింది. మేక పరిగెత్తుతుంటే దాని ఒంటికున్న పసుపు కుంకుమలు రాలి నేల మీద పడ్డాయి.

కంటికి కనిపించనంత దూరం అది వెళ్లేంతవరకు అక్కడే నిలబడ్డాడు. వెళ్లిందన్న నమ్మకం కుదిరాక, ఏమీ తెలియనట్లు.. ఎవ్వరికీ అనుమానం రాకుండా.. చిన్నగా ఇంటివైపు నడిచినాడు. ■

## ఆర్.సి.కృష్ణస్వామి రాజు



సమాజంలో జరిగే సంఘటలను పాఠకుల కళ్లకు కట్టేలా.. కథలుగా మలుస్తున్నారు ఆర్.సి.కృష్ణస్వామి రాజు. ఈయన స్వస్థలం తిరుపతి. ఎంఏ జర్నలిజంతోపాటు పబ్లిక్ రిలే షన్స్, మార్కెటింగ్‌లో డిప్లమోలు చేశారు. ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందారు. 1984 నుంచీ కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు 500కుపైగా కథలు రాశారు. వీటిలో దాదాపు 500 కథలు వివిధ దిన, వార పత్రికల్లో అచ్చయ్యాయి. 13 కథా సంపుటాలను వెలువరించారు. ఈయన రాసిన మొదటి కథ.. 'ఈకాలం పిల్లలు'. ఆంధ్రజ్యోతి వారప త్రికలో ప్రచురితమైంది. ముగ్గురాల్ల మిట్ట, పల్లెకు పోదాం, పాడిలేని ఇల్లు.. పాడి లేని చేను, రాళ్ల బియ్యం, అమ్మ విమానం ఎక్కాలంది, సల్లో సల్ల, బడి బియ్యం, దుశ్శాలువా కప్పంగ కథలు పాఠకుల మన్ననలు పొందాయి. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో పాతిక కథలకు పైగా బహుమతులు గెలుచుకు న్నారు. సాహిత్య సేవలో భాగంగా లెక్కకు మిక్కిలి పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.